


# మనసు మారింది

రచన : రావిపల్లి నారాయణరావు

ఆరోజు మొదటితేది. కప్పులు గబగబ దొర్లుతున్నాయి. డబ్బులు గలగల రాల్తున్నాయి. వచ్చేజనం వస్తున్నారు. పోయేజనం పోతున్నారు. ఆ రోజా కాఫీహొటలుకు తీరికలేనిపని కలిగింది. అయ్యర్‌గారి పెట్టినిండింది. నిత్యం నిర్జీవంగా పనిచేసే సర్వర్ శరభయ్యా కూడా ఆ రోజు నిర్విచారంగా పనిచేయటం ఆ నాటి విశేషం.

ఆ హొటల్లో శరభయ్యగురించి చెప్పుకోని వారుండరు. అంట్లుతోమే మనిషినుండి డబ్బు వసూలు చేసే అయ్యర్‌వరకు అతన్ని హేళన చేసే వారే! పిచ్చివానిలాగుండే అతని ప్రవర్తనే అందుకు కారణం.

శరభయ్యాదేవూరో తెలీదు కాని అతనా హొటల్లో ప్రవేశించి పది సంవత్సరాలు పైబడుంటుంది. ఒకరితో సంబంధం లేకండా తన పనేదో చూచుకుని పోతుండటం అతని అలవాటు. పని సక్రమంగా చేస్తాడు కాని మనిషి మాత్రం పరధ్యానంగా వుంటాడు. "శరభయ్యా! కప్పులు అయాయా?" అనడిగితే "ప్లేట్లు తెమ్మంటారా?" అని పరిగెడతాడు. అప్పుడప్పుడు ఆలోచిస్తు తడసిన కళ్లను తుడుచుకుంటుండటం కూడా జరుగుతుంది. వేళ యేనర్కి రెండు ప్లేట్లకు తక్కువ కాకుండా తింటారు సెర్వర్లు. కాని ఒక ప్లేటు పూర్తి చేయటం సెర్వర్ శరభయ్యకు మహా కష్టంగానుంటుంది. రాత్రంతా అతను మెలకువగావుంటాడు. ఎప్పుడు నిద్రపోతాడొ ఎవరికితెలియదు. పది సంవత్సరాల నుండి పని చేస్తున్న శరభయ్యా పరిస్థితి తోటి సెర్వర్లకే తెలీనప్పుడు డబ్బాదగ్గర కూర్చునే అయ్యర్ గారి కెలా అర్థమవుతుంది ?

శరభయ్యా వయస్సు ముప్పై సంవత్సరాలు దాటుంటుంది. వెడల్పయిన మీసాలు, ఎత్తైన చెప్పు, మెలికలు తిరిగే కండరాలు కల శరభయ్యా చుట్టానికి చాలా గంభీరంగా కనబడతాడు. కాని తైలసంస్కారంలేని జుత్తు, కత్తి స్పర్శతగలని గడ్డం, నిర్జీవంగానుండే ముఖం అతని స్వరూపానికి వికృతాకారాన్ని కలిగిస్తాయి. శరభయ్యా ముఖం నిర్విచారంగా కనబడేది నెలకోరోజు. అదే మొదటి తారీకు.

ఆ రోజు శరభయ్యా శుభ్రంగా స్నానం చేస్తాడు. పుష్టిగా తింటాడు. చిరకాలంనుండి పీడిస్తున్న విరహ వేదనను మరచి పోతాడు. కళకళ లాడుతు సజీవంగా వుంటుందతని ముఖం. అయ్యరు యిచ్చిన యిరవై రూపాయిలందుకుని పల్చని లాల్చి జేబులో జాగ్రత్త చేస్తాడు. హొటలు మూసేక విహారానికి బయలు దేర్తాడు. ముప్పై రోజులు శవంలాగుండే శరభయ్యా ఒకటో తేదీన అమాంతంగా పిల్లి మంగళుడిలా తయారవటం చూచి సెర్వర్లంతా ఆశ్చర్యపడతారు. అందుకే అతన్ని పిచ్చివాడంటారంతా.

అమావాస్య; అర్ధరాత్రి—కారు చీకట్లు కమ్ముకొన్నాయి. మునిసపల్ దీపాలు వెలుగుతున్నాయి. ఫర్లాంగు దూరాన్న కనబడే గుడిసెలు ఎదురెళ్లేవాళ్లని ఆహ్వానిస్తున్నాయి. అడ్డదారిన పట్టే వాళ్లంతా అలా వెళ్తున్నారు. వాళ్ల దారే పట్టాడు సర్వర్ శరభయ్యా.

అది పూరిగుడిసె కాలని. అప్సర్సలనబడే అబలల అంగడి. పలుప్రాంతాల నారీమణులకది నివాసస్థలం. కామాంధకారంతో వొళ్లు మరచిన రసికాగ్రేసురులంతా అక్కడ హాజరవుతారు. తృణమో, ఫణమో చెల్లించి అంధకారంనుండి విముక్తులౌతారు. ఆరోజు బేరం జాస్తిగావుంది. కాళీలేక కాచుకు కూర్చునే పెద్దమనుష్యుల్ని చూచి శరభయ్యా నవ్వుకున్నాడు. కాఫీహొటలు కంటే బ్రోతల్ కంపెని బేరం ఎక్కువగానుందని తలచేడు. ఆలోచిస్తు కాలనీలోకాలు పెట్టాడు. ఎర్రని గుడ్డ తలకుచుట్టి, తురకపంచ అడ్డుగకట్టి బీడి పొగను విడిచిపెడ్తు ఆజాన బాహుడైన ఒక ఆసామి అక్కడకువచ్చి శరభయ్యాను పలుకరించాడు. శరభయ్యాకు అతనితో పదిసంవత్సరాలనుండి పరిచయంవుంది. అందుకే అతను అందర్నీ విడచి శరభయ్యాను మొదట పిలిచేడు.

"కొత్తపిట్ట నొకటి రాజమండ్రినుండి కొట్టుకొచ్చాను" మెల్లగా చెవిలోవూదాడు.

"ఎన్నాళ్లయిందేవిటి?" శరభయ్యా అడిగాడు.

"అబ్బే! యీరోజే. మీదే ప్రారంభం."

శరభయ్యా నవ్వాడు.



"ఒకచిక్కు. అది ఒకంతట చెప్పుకోవటం లేదు. మంచి మాటలాడి నెమ్మదిగా చెప్పిం చాలి. అందుకే మీకు చెప్ప జెప్తాను." అన్నాడు పొడుగాటి ఆసామి. అలాగే అంటు శరభయ్య అతనివెంట నడిచాడు.

గదిలోపలకు వెళ్లగానే శరభయ్య గడియ పెట్టాడు. గదిచిన్నదైనా అందంగాఅలంకరింప బడివుంది. మల్లెపూల వాసనకు శరభయ్య మతి స్థిమితంగా వుండలేక పోయింది. తెల్లని చీరకట్టుకుని మంచంపై కుర్చొనున్నస్త్రీ, దేవ తలా కనిపించిందతనికంటికి. మీసాలు త్రిప్పుతు ఆమె ప్రక్కకూర్చున్నాడు సర్వర్ శరభయ్య. అపరిచయస్తులతో పరిచయం కల్పించుకోవటం అతనికది అలవాటు. దగ్గ రగాజరిగి ఆమె భుజంపై చేయివేసాడు శర భయ్య. కరెంటుషాక్ తిన్నట్లు భుజంపైవేసిన చేయికింద పడింది. ఆమె అతని కాళ్లపై పడింది. కన్నీటితో శరభయ్యకాళ్లు తడి సాయి. అతని వొళ్లు చల్లబడింది. అతని మతి స్థిమిత పడింది.

"ఎందుకేడుస్తున్నావ్?" సూటిగా చూస్తు అడిగాడు శరభయ్య.

"నేనీ వృత్తి చేయటానికని రాలేదు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి నన్ను రాజమండ్రి నుండి తీసుకువచ్చాడు యీబ్రోకర్. యిప్పుడు నన్నీ వృత్తి చేయమని నిర్బంధిస్తు న్నాడు." యేడుస్తు చెప్పింది.

గుండ్రంగానుండే ఆమె కళ్లు నీటితో నిండాయి. బుగ్గలు ఎరుపెక్కాయి. ముఖం వివర్ణమైంది. ఆమెపరిస్థితి చూచేక శరభయ్య మనస్సు కరిగింది. అతని మనస్సులో తీరని కోరికలు బయలుదేరాయి. పాతజీవితం అతనికి జ్ఞప్తికొచ్చింది. పది సంవత్సరాల ఒంటరి జీవితంపై అతనికి రోతకలిగింది. అతని మనస్సుమారింది. మళ్లాసంసారి కావా లని మనస్సుకోరింది.

"నేనొకటి చెప్తావింటావా? శరభయ్య అడిగాడు.

'ఏమిటి?' అని ఆమెఅనలేదు. కాని ఆమె అలాచూచింది.

అభ్యంతరం చెప్పకపోతే నిన్నుపెళ్లి చేసు కుంటా" అతనన్నాడు.

ఆమెనవ్వలేదు. యేడ్వలేదు. మాటాడక తలదించుకుంది.

"యేం యిష్టంలేదా? అవును; నాగడ్డాలు, మీసాలు నీ కిష్టపడతాయా?" విరక్తిగా అన్నాడు.

"లేదు....లేదు...." యీసారి ఆమె యేడ్చింది.

"మరి నీ వుద్దేశం?" గద్దించి అడిగాడు.

"నేనొక అభాగ్యజీవిని. ధర్మ ప్రభువులా ఆదరించి, కంటికి రెప్పలా కాపాడే కరుణార్ద్ర హృదయుని కన్నుగప్పి నేనీ స్థితికి వచ్చాను. నా సంసారాన్ని మంటగలిపి నా జీవితాన్నీ గతికి తెప్పించింది మా అమ్మ. పది సంవత్స రాల క్రిందటిమాట. నేను, అమ్మ రాజ మండ్రిలోవుండే వాళ్లం. మేము కళావంతు లం. జీవనోపాధిలేక నన్ను కుల వృత్తిలోనికి దింపింది మాఅమ్మ. మాయిల్లొకరహదారైంది. నా జీవితమొక ఆట బంతయింది. అందరి కంటె ఒక వర్తకుని నా అందం ఎక్కువగా ఆకర్షించింది. నన్నతను తనదానిగా చేసు కున్నాడు, అప్పటినుండి అతనిభార్యగా నేనుం టుండేదాన్ని. అతనికి 'నా' అనే మరెవ్వరు లేరు. నన్ను కంటికి రెప్పలా కాపాడేవారు. వర్తకంలో వేలకు వేలు లాభంవచ్చింది. నన్ను నమ్మి అంతా నాకే చెప్పజెప్పేవారు. ముసలిదైనా మా అమ్మకు డబ్బుమీద మమ కారం పోలేదు. అతని కన్నుకప్పి మరోవర్త కునికి నన్ను పరిచయం చేసింది. "నాతో లేచివస్తే అందల మెక్కిస్తాన" ని మభ్యపెట్టా డావర్తకుడు. అమ్మ ప్రోద్బలం వలని నన్ను నమ్మిన మొదటి వర్తకుని ఆస్తి కాజేసి ఒక రాత్రి రెండోవర్తకునితో లేచి పోయాం. అతను నా యౌవ్వనం అనుభవించి నన్ను దిక్కులేనిదానిగా చేసి పోయాడు. కొన్ని రోజులు గడచేక పాపం వడికట్టింది కాబోలు మా అమ్మప్రాణాలు విడచింది. అప్పటినుండి అక్కడక్కడ అంట్లు తోముతు గోదావరి వొడ్డు నుండే గుడిసెలో కాలం గడిపేదాన్ని. నన్ను యీ బ్రోకర్ అక్కడికివచ్చి నన్ను పెండ్లిచేసు కుంటానని మభ్యపెట్టాడు. అతనిక్కూడా ఈ కథ చెప్పాను. అయినా ఫరవాలేదని చెప్పి పెళ్లి చేసుకుంటానని మోసగించి నన్నీస్థితికి తీసుకువచ్చాడు" గడచినగాధ చెప్పి అతని వైపుచూచింది. అతని కళ్లు చింతనిప్పుల్లా మెరిసాయి. అతని ముఖం కందగడ్డలా ఎర్ర బడింది. అతని పండ్లనుండి పట పట శబ్దం ధ్వనించింది.

"మాలతీ!" అరిచాడు శరభయ్య.

మంచంపై కూర్చున్నస్త్రీ—అదే మాలతి విత్తరిచూపులతో నాపేరెలా తెలిసిందని అతని వైపు ఆశ్చర్యంగా చూచింది. అరిచేటప్పుడతని విరిగినపైపన్ను స్పష్టంగా కన్పించిందామెకు. "అ....అతను....అయనే....శరభయ్య" తనలో అనుకుంది మాలతి.

"నాజీవితం యిలా నాశనమవటానికి కారణం నీవే. నేనే ఆ శరభయ్యను మాలతీ!" క్రోధం అతనిలో ఉప్పొంగింది. బలమైన అతని చేతులు ఆమె మెడను చుట్టాయి.

నిన్నింకా ప్రాణాల్తో విడిస్తేనాలాంటి అమా యకులు ఎంతోమంది సన్యాసులుకాక తప్పదు. నీ ప్రాణాన్ని యిప్పుడే తీసేస్తా" అరిచాడు శరభయ్య.

"మగడని నమ్ముకునే వాని చేతుల్లో ప్రాణాల్ని విడవటం కంటే కావాల్సిం దేముంది?" నవ్వుతు అంది మాలతి. ముత్యాల్లావుండే ఆమెపళ్లు వెండితెరలా కన్పిం చిందతనికి, ఆ చిరునవ్వునే అతనా నాడు కోరేడు. ఆచిరునవ్వునే యీనాడు హింసించ టానికి పూనుకున్నాడు. శరభయ్య మనస్సు వెనక్కు పరుగెత్తింది. గడచిన రోజులు జ్ఞప్తికివచ్చాయి. మాలతిప్రవర్తన అతనికళ్లలో సంచరించింది. వారిరువురి జీవితాలు నాశనం కావటానికి కారకులెవరో అతనికర్థమైంది. అతని మనస్సు మారింది. మెడపైనుండి చేతులు క్రిందకు జారాయి. మాలతినిలతలా అల్లుకున్నాయి. శరభయ్య బాహువుల్లో బంధింప బడింది మాలతి.

కొద్ది రోజుల్లో 'మాలతి కేఫ్' అనే పేరుతో శరభయ్య ఒక టీ కొట్టు పెట్టాడు. మొదటి రోజు మిత్రులందరిని టీపార్టీ కాహ్వానించాడు. విందుకు వచ్చిన తోటి సర్వర్లు శరభయ్యను పిచ్చివాడనలేదు. పెద్దవాడని పొగిడారు.

★

